సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



డబుల్ కల నెరవేరేనా?

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు మొదలైంది. అర్హులెవరో తేల్చేందుకు ఇంటింటి సర్వే జోరుగా సాగుతోంది. 8లో▸




యథేచ్ఛగా తరలుతున్న కలప

అడవులు గొడ్డలివేటుకు గురవుతూనే ఉన్నాయి. యథేచ్ఛగా కలప తరులుతూనే ఉంది. సంబంధిత పట్టించుకోవడం లేదు. 8లో▸



ఇట్టే పట్టేయొచ్చు

సాంకేతికత ఆధారంగా సెల్‌ఫోన్ బ్లాక్ చేయడం, ట్రేస్ చేయడం ఇప్పుడు అత్యంత సులువుగా మారింది. 9లో▸



న్యూస్‌రీల్

23న గురుకుల పరీక్ష

పరిగి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 2023– 24 సంవత్సరానికి గాను 5వ తరగతి ప్రవేశ పరీక్షను ఈ నెల 23న నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఉదయం 9:30 గంటలలోపు పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని, హాల్ టికెట్, నలుపు, లేదా నీలం రంగు పెన్ను, ప్యాడ్ తీసుకుని రావాలని సూచించారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఆర్టిజియన్ కార్మికులు

తాండూరు టౌన్: ప్రభుత్వం తమకిచ్చిన హామీలను విస్మరించిందంటూ విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజియన్ కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. గురువారం పట్టణంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 23వేల మంది కార్మికులను రెగ్యులరైజ్ చేస్తానని అనేక సభల్లో ప్రకటించిన సీఎం కేసీఆర్ మాట తప్పారని ఆరోపించారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేదని మండిపడ్డారు. చాలీచాలని వేతనాలతో, ఎలాంటి అలవెన్సులు లేకుండా వెట్టిచాకిరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. డిమాండ్ల సాధన కోసం కార్మికులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

గడువులోపు బియ్యం డెలివరీ చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్ అర్బన్: నిర్ణీత గడువులోపు సీఎంఆర్ బియ్యం డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. యాసంగి, వానాకాలం సీజన్‌కు సంబంధించిన బియ్యాన్ని సకాలంలో పౌరసరఫరాల శాఖ, ఎఫ్‌సీఐకి చేరవేయాలని సూచించారు. తమ వద్ద గన్నీ బ్యాగులు కొరత ఉందని, ఎఫ్‌సీఐకి పంపించాల్సిన బియ్యం విషయంలో మినహాయింపు ఇవ్వాలని మిల్లర్లు కోరగా.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, మేనేజర్ విమల, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో అడ్మిషన్లకు ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట్, రామంతపూర్ పాఠశాలల్లో 2023– 24 విద్యా సంవత్సరానికి గానూ ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కోటాజీ ఒక ప్రకటనలో తెలిపారు. లంబాడా– 4, ఎరుకల, చెంచు– 1, ఇతర గిరిజన తెగలు– 1, మొత్తం – 6 (ఎస్టీ బాలుర – 3, బాలికలు– 3) సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు వికారాబాద్ జిల్లావాసులై ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారైతే రూ.2 లక్షలలోపు ఉండాలని తెలిపారు. ఒక కుటుంబం నుంచి ఒక్క విద్యార్థికి మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 29లోపు గిరిజన సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వివరాలకు 8639388553, 9908598481 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ప్రజా సేవకుడు.. పాలనా దక్షకుడు

పాలించే రాజు.. సమర్థుడు, ప్రజాసేవకుడైతే జనం కళ్లలో సంతోషం.. ఇళ్లలో 'సంక్షేమం' కనిపిస్తుంది. ఇప్పటివరకు జీతాలు.. తమ బ్యాంకు ఖాతాలనే చూసుకుంటూ.. ప్రజల సమస్యలను పెద్దగా పట్టించుకోని ఉన్నతాధికారులతో విసిగి వేసారిన జిల్లావాసులకు కలెక్టర్ నారాయణరెడ్డి రూపంలో పెద్ద ఊరట లభించింది. తన పనితీరుతో అధికారులు, సిబ్బందికి స్ఫూర్తిగా నిలుస్తూనే.. సమస్యల తక్షణ పరిష్కారంతో జనం గుండెల్లో దేవుడిలా మారారు మన కలెక్టర్ నారాయణరెడ్డి. గురువారం తనను కలిసిన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

- కొత్త కలెక్టర్ రాకతో మెరుగైన పాలన
- ధరణి సమస్యలకు చకచకా పరిష్కారం
- జిల్లా ప్రజలకు ఉపయోగపడేలా ఇసుక పాలసీ
- పీడీఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణాపై కొరడా
- సంక్షేమం, శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి



'సాక్షి'తో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: సాధారణ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చా.. ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉంది. అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లేలా ప్రత్యేక ప్రణాళికతో సాగుతున్నా. అధికారుల్లో జవాబుదారీ తనాన్ని పెంపొందించేలా మార్గనిర్దేశనం చేశా. మొదట్లో కొంత ఇబ్బంది పడినా.. ప్రజల నుంచి వస్తున్న ప్రతిస్పందన, గౌరవంతో అన్ని శాఖల్లో చాలా మార్పు వచ్చింది. సమయపాలన, విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అటెండెన్స్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చాం. దీంతో ఉన్నతాధికారి నుంచి అటెండర్ వరకు టైమింగ్స్ పాటిస్తున్నారు. ఆఫీసు వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. అభివృద్ధి పనులు చకచకా పూర్తయ్యేలా.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నాం. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో జీవించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రానున్న ఏడాది కాలంలో అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

కలెక్టరేట్‌తో ప్రక్షాళన మొదలు

వచ్చీరాగానే కలెక్టరేట్‌లో పరిస్థితులు చూసి కొంత అసహనానికి గురయ్యా. గాడి తప్పిన వ్యవస్థను ఇక్కడి నుంచే చక్కదిద్దేలా అడుగులు ప్రారంభించా. దీంతో క్షేత్రస్థాయి ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించడం మొదలైంది. తప్పు చేసిన వారిని అక్కడికక్కడే శిక్షించడంతో.. అందరిలో ఒకింత భయం మొదలైంది. ఇది నాక్కూడా ఇబ్బందిగా అనిపించినా.. తప్పలేదు. నిత్యం గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తూ ఆకస్మిక తనిఖీలు చేపట్టా. ఇది సత్ఫలితాలనిస్తోంది.

5వేల ప్రాబ్లమ్స్ క్లియర్

జిల్లాలో ధరణి సమస్యలు అధికంగా ఉన్నాయి. బాధ్యతలు తీసుకున్నది మొదలు రోజుకు 150 సమస్యలకు పైగా పరిష్కరిస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. చిన్నచిన్న సమస్యలైతే అక్కడికక్కడే పరిష్కరిస్తున్నాం. ఈవారం వచ్చిన దరఖాస్తు దారుడు అదే అర్జీ పట్టుకుని తర్వాతి వారం రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సమస్యలకు పరిష్కారం లభిస్తుండటంతో అర్జీల సంఖ్య పెరుగుతోంది. నేను వచ్చాక ధరణికి సంబంధించి 5వేల ప్రాబ్లమ్స్ క్లియర్ చేశాం.

త్వరలోనే 'మెడికల్' సేవలు

వెనకబడిన ప్రాంతమైన మన జిల్లాకు మెడికల్ కాలేజీ, అనుబంధ ఆస్పత్రి రావడం శుభపరిణామం. దీంతో జిల్లాలో ఆరోగ్య సేవలు బలోపేతమవుతాయి. పేదలకు ఉచితంగా అధునాతన ట్రీట్‌మెంట్ అందుతుంది. వచ్చే ఏడాది నుంచి ఈసేవలు ప్రారంభమవుతాయి. అనంతగిరి గుట్టపై స్థలాన్ని ఫైనల్ చేశాం. రెండేళ్లలో ఇక్కడ మెడికల్ కాలేజీ భవనాన్ని అందుబాటులోకి తెస్తాం. ప్రస్తుతం కళాశాల, ఆస్పత్రి నిర్వహణకు ఇబ్బంది లేదు. టీబీ శానిటోరియంలో అకామిడేషన్ అందుబాటులో ఉంది.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం

మన జిల్లా అవసరాలకు మించిన ఇసుక ఇక్కడ లేదు. కాగ్నా నది మాత్రమే మనకున్న ఏకైక ఆధారం. దీంతో జిల్లా ప్రజలే ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ, ప్రైవేటు పనులు, ప్రజలకు ఇసుక సరఫరా చేసేందుకు ఎక్కువ డబ్బులు వసూలు చేయడం లేదు. మన ప్రాంత వాసులకు తక్కువ ధరకు లభించేలా ఇసుక పాలసీని రూపొందించాం. ట్రాక్టర్‌కు రూ.600 చొప్పున సీనరేజ్ డబ్బులు మాత్రమే చెల్లించేలా చూస్తున్నాం. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యం తరలించినా, విక్రయించినా కఠినంగా వ్యవహరిస్తాం.

సేవలు బాగున్నాయా..?



వికారాబాద్ ఏరియా ఆస్పత్రిలో బాలింతలతో మాట్లాడుతున్న కలెక్టర్

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని గర్భిణులు, మహిళలు, చిన్నపిల్లల వార్డులు, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. బాలింతలు, రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న 70 మందికి మంచి ఆహారం అందించాలని సూచించారు. అధునాతన సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉన్నందున మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రదీప్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ నాగమణి, ఆరోగ్యశ్రీ జిల్లా ఇన్‌చార్జీ వీరేశం తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాక్టరీని సీజ్ చేస్తున్న అధికారులు

'కాలుష్యానికి' మూత

- ఫలించిన గుంతబాసుపల్లి పోరాటం
- ఇండస్ కెమ్ ఫ్యాక్టరీ సీజ్
- కలెక్టర్, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపిన గ్రామస్తులు

తాండూరు రూరల్: గుంతబాసుపల్లి శివారులోని ఇండస్ కెమ్ జిప్సం ఫ్యాక్టరీని గురువారం అధికారులు సీజ్ చేశారు. కర్మాగారం నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు తాగు, సాగు నీరు కలుషితమవుతోంది. ఈ విషయమై స్థానిక సర్పంచ్ జగదీశ్‌తో పాటు గ్రామస్తులందరూ ఫ్యాక్టరీ ఎదుట పలుమార్లు పెద్దఎత్తున ధర్నా చేశారు. కాలుష్య నియంత్రణ మండలితో పాటు కలెక్టర్, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పొలాల్లో తిరిగి విచారణ చేపట్టారు. తాగు, సాగు నీటి కలుషితం వాస్తవమేనని నిర్ధారించారు. ఫ్యాక్టరీని మూసేయాలని మార్చి 15న ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ కంపెనీ నిర్వాహకులు మాత్రం యథావిధిగా కర్మాగారాన్ని నడిపిస్తున్నారు. దీంతో సర్పంచ్, గ్రామస్తులు.. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, డీఆర్‌ఓ అశోక్‌కుమార్‌కు మొరపెట్టుకున్నారు. దీంతో ఆర్‌ఐ బాల్‌రాజ్, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సిద్ధార్థ్ ఉదయాన్నే గ్రామానికి చేరుకున్నారు. సర్పంచు జగదీశ్, ఉప ససర్పంచ్ ఖైరత్‌అలీ, గ్రామస్తులతో కలిసి ఫ్యాక్టరీని సీజ్ చేశారు. ఫ్యాక్టరీలో ఉన్న ల్యాబ్‌తో పాటు వాహనాలను కూడా సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. జిప్సం ఫ్యాక్టరీని మూసేయించిన కలెక్టర్, ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మిడ్ వైఫరీ వ్యవస్థ దేశానికే ఆదర్శం



రోగులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు రెట్టింపు
- నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో
- డయాలసిస్, రక్తనిధి కేంద్రాల ప్రారంభం

నాంపల్లి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేందుకు మిడ్ వైఫరీ వ్యవస్థను ఏర్పాటు చేశామని, ఈ విధానం దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గతంలో 30 శాతం సాధారణ ప్రసవాలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 65 శాతానికి పెరిగిందన్నారు. ఇందులో భాగంగానే నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో మిడ్ వైఫరీ వ్యవస్థపై 18 నెలలుగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గురువారం నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో ఐదు పడకల డయాలసిస్ కేంద్రం, రక్తనిధి కేంద్రాలను (బ్లడ్ బ్యాంక్) ఆయన స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఉస్మానియా, గాంధీ, నిమ్స్ తదితర మూడు ఆసుపత్రుల్లోనే డయాలసిస్ కేంద్రాలు ఉండేవన్నారు. ప్రస్తుతం వీటి సంఖ్య 102కు చేరుకుందని , ప్రతి నియోజకవర్గంలో ఒక డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిపారు. డయాలసిస్ కేంద్రాల ద్వారా ఆరోగ్య శ్రీ కింద వారానికి రెండు మూడుసార్లు ఉచితంగా డయాలసిస్ చేస్తున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్డ్ ఫిల్టర్‌ను ఉపయోగించి డయాలసిస్ చేస్తున్నామని, తద్వారా ఒకరి నుంచి మరొకరికి ఇన్ఫెక్షన్ రాకుండా కార్పొరేట్ తరహాలో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. డయాలసిస్ రోగులకు ఆర్థికంగా భరోసా ఇచ్చేందుకు ఆసరా పెన్షన్, ఉచిత బస్‌పాస్ కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏటా 150 వరకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు జరుగుతున్నాయని, ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల వరకు ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ తర్వాత అవసరమయ్యే మందులను కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. కిడ్నీ రోగుల కోసం ఏడాదికి రూ.200 కోట్లు ఖర్చు చేస్తుండగా, అందులో డయాలసిస్ రోగుల కోసం ఏటా రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 28 ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులు ఉండగా, నేడు వాటి సంఖ్య 56కు చేరుకుందన్నారు. 27 బ్లడ్ బ్యాంకులకు కాంపోనెంట్ సపరేటర్స్ ఇచ్చామని, ఫలితంగా ఒక్క యూనిట్ రక్తాన్ని ముగ్గురికి వాడుతున్నట్లు మంత్రి వివరించారు. నగరానికి నలువైపులా టిమ్స్ (టిఐఎంఎస్) పనులు చురుగ్గా జరుగుతున్నాయని, గచ్చిబౌలి టిమ్స్‌ను కూడా వెయ్యి పడకలు, నిమ్స్‌కు అదనంగా రెండు వేల పడకలను మంజూరు చేశామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చే నెలలో నిమ్స్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్, టీడీపీ హైదరాబాద్‌లో ఒక్క ఆసుపత్రి కూడా నిర్మించలేదన్నారు. రాష్ట్రంలో ట్రామా కేర్ సెంటర్లను లెవల్ వన్, లెవల్ టు, లెవల్ త్రీగా వర్గీకరించి బలోపేతం చేస్తున్నామని, కార్పొరేట్ తరహాలో అత్యవసర సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలో ఎక్కడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల కోసం మెయింటెనెన్స్ ఇవ్వడం లేదని, తెలంగాణ ప్రభుత్వం ఒక్కో పడకకు ప్రతి నెల రూ.7500 ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కేసీఆర్‌ను గద్దె దించడం బీజేపీతోనే సాధ్యం

బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

చేవెళ్ల: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గద్దె దించాలంటే బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. చేవెళ్లలో ఈ నెల 23న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగ సభ ఏర్పాట్లను మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులతో కలసి గురువారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇతర పార్టీలకు ఓటు వేస్తే అది బీఆర్‌ఎస్‌కు వేసినట్లేనని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలు తన వైపు లేరని కేసీఆర్‌కు తెలిసిపోయిందని, దీంతో ఆత్మీయ సమ్మేళనాల పేరుతో మద్యం, బిర్యానీలు పెట్టి లీడర్లకు వెలకట్టే దిగజారుడు రాజకీయలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతులకు రూ.లక్ష రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలకు సంబంధించిన నిధులు కేంద్రం వాటా ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మహిళల చేతి నుంచి వడ్డీని కట్టించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని తెలంగాణ ఉద్యమ ట్యాగ్‌లైన్‌నే మరిచిపోయారని విమర్శించారు. 30లక్షల మంది నిరుద్యోగులకు రావాల్సిన భృతి లేకపోగా.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలతో వారికి ఉద్యోగాలు రాకుండా చేశారన్నారు.



మంత్రి సబితారెడ్డిని కలిసిన చీమల్‌దరి సర్పంచ్ నరసింహారెడ్డి



సంతోషం వ్యక్తంచేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ఆనంద్

జిల్లాకే గర్వకారణం..

చీమల్‌దరి గ్రామం జాతీయ ఉత్తమ పంచాయతీగా నిలవడం జిల్లాకే గర్వకారణమని మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సర్పంచ్ నాసన్‌పల్లి నర్సింహారెడ్డి గురువారం హైదరాబాద్ చేరుకుని ఎమ్మెల్యేతో వెళ్లి.. మంత్రి, ఎంపీని కలిశారు. – మోమిన్‌పేట్

ఉల్లి రైతు కన్నీళ్లు

- ధర పతనమై.. పెట్టుబడులు దక్కని దుస్థితి
- క్వింటాలుకు రూ.650 నుంచి రూ.800
- అప్పులు తీర్చే మార్గం లేక రైతుల ఆందోళన
- ప్రభుత్వం ఆదుకోవాలని అభ్యర్థన



మార్కెట్‌కు తరలించేందుకు సంచులు సిద్ధం చేస్తున్న రైతులు

పెద్దేముల్: ఉల్లి రైతుకు కన్నీరే మిగులుతోంది. అనేక కష్టనష్టాలకోర్చి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే కనీస మద్దతు ధర రాక తీవ్రంగా నష్టపోతున్నారు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొందని రైతులు లబోదిబోమంటున్నారు. వ్యవసాయానికి పెద్ద పీట వేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వ మాటలు క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎకరా పొలంలో పంట సాగుకు రూ.20 వేలనుంచి రూ.25 వేల ఖర్చు వస్తోందని చెబుతున్నారు. చివరకు పెట్టుబడులు కూడా దక్కడం లేదని, అప్పులు, వడ్డీలు పెరిగి ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

ఊరూరూ తిరిగి..

పెద్దేముల్ మండలంలోని గిర్మాపూర్, హన్మాపూర్, ఉషానాయక్‌తండా, గాజీపూర్, పెద్దేముల్, గొట్లపల్లి, ఇందూరు, ఆత్కూర్ తదితర గ్రామాలకు చెందిన రైతులు ఏటా పెద్ద విస్తీర్ణంలో ఉల్లి సాగు చేస్తారు. గతంలో కిలో ఉల్లి ధర రూ.40 నుంచి రూ.50 వరకు పలకగా ప్రస్తుతం రూ.10కి పడిపోయింది. బీట్లు నిర్వహించే మార్కెట్‌కు తీసుకెళ్తే క్వింటాలుకు రూ.650 నుంచి రూ.800 పలుకుతోంది. దీంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని కర్షకులు వాపోతున్నారు. ధర పెరిగే అవకాశాలు కూడా కనిపించకపోవడంతో చేసేది లేక.. పంటను తీసి సంచుల్లో నింపి.. ఆటోలు, ట్రాక్టర్లలో తీసుకెళ్లి గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతూ 40 కిలోల బస్తాను రూ.350 నుంచి రూ.450 చొప్పున విక్రయిస్తున్నారు. ఒక్కోసారి రవాణా ఖర్చులు కూడా రావడం లేదని చెబుతున్నారు.

వ్యాపారుల మాయాజాలం..?

పంట చేతికి వచ్చే సమయంలోనే ఉల్లి ధరలు పతనమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎప్పుడు చూసినా కిలోకు రూ.25 తగ్గని ఉల్లి ధరలు పంట తీసే సమయంలో దారుణంగా పడిపోతున్నాయని చెబుతున్నారు. వ్యాపారులు, దళారుల దగాతోనే ఈ దుస్థితి నెలకొంటోందని చెబుతున్నారు. కనీస మద్దతు ధర లేకపోవడంతో ఉల్లి సాగు చేసేందుకు జంకాల్సిన పరిస్థితి ఎదురవుతోందని నిట్టూరుస్తున్నారు.

అందుబాటులో లేని కోల్డ్ స్టోరేజీలు

రేటు లేకపోవడంతో ఎక్కడైనా నిల్వ చేద్దామనుకున్నా కోల్డ్ స్టోరేజీలు అందుబాటులో లేవు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండటానికే సరైన వసతులు లేని ఇళ్లలో పంటను నిల్వ చేసే పరిస్థితి లేదు. ఇదే అదనుగా భావిస్తున్న వ్యాపారులు అదను చూసి ధరలు తగ్గించేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను చేనులో వదిలేయలేక.. మార్కెట్‌లో ధర లేక సతమతమవుతున్నారు.

మద్దతు ధర కల్పించాలి



ఉల్లి రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలి. ఎల్లవేళలా మార్కెట్ అందుబాటులో ఉండేలా చూడాలి. క్వింటాలుకు కనీసం రూ.2 వేలకు తగ్గకుండా ఇవ్వాలి. ప్రస్తుతం ధరలు లేక పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. ఏడాది పాటు నిల్వ ఉండే ఉల్లికి అవసరమైన కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలి.

– రాంరెడ్డి, రైతు, గిర్మాపూర్

ప్రభుత్వం ఆదుకోవాలి



తాండూరు నియోజకవర్గంలో ఉల్లి పంట ఎక్కువగా సాగు చేస్తారు. ఉల్లి రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందడం లేదు. ఉల్లి రైతులను యూనిట్‌గా ఏర్పాటు చేసి ప్రత్యేక రాయితీలు, రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలి. విత్తనాలు, మందులు ఉచితంగా ఇవ్వడంతో పాటు మద్దతు ధర ప్రకటించాలి.

– బాలప్ప, రైతు పెద్దేముల్

క్లుప్తంగా

స్తంభం పడిపోయినా పట్టించుకోని అధికారులు



అక్నాపూర్‌లో విరిగిపడిన విద్యుత్ స్తంభం

నవాబుపేట: విద్యుత్ స్తంభం విరిగిపడి ఐదు రోజులవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని అక్నాపూర్ గ్రామ వ్యవసాయ పొలాలకు ఈ స్తంభం ద్వారానే విద్యుత్ సరఫరా అవుతుందని సర్పంచ్ అజయ్‌కుమార్, రైతులు తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా కన్నెత్తి చూడటం లేదని అన్నారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో నీరు అందక పొలాలు ఎండుముఖం పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని వారు కోరారు.

రంజాన్ కానుకలు



కానుకలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు తిరుపతిరెడ్డి తదితరులు

కొడంగల్ : నియోజకవర్గంలోని ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కానుకలు అందజేశారు. కోస్గి పట్టణంలోని ఏబీకే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు తమ వంతు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రేవంత్ అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. రేవంత్ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఆయన హయాంలో ప్రారంభించిన పనులను ప్రస్తుత సర్కార్ నేటికీ పూర్తి చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

మర్పల్లి: కురుమ, గొల్ల, యాదవ కుటుంబాలకు చెందిన వారు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రెండో విడత గొర్రెల యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. గురువారం మండల పరిధిలోని కోట్‌మర్పల్లిలో గొర్రె కాపరుల సంఘం సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 ఆడ గొర్రెలకు,పొట్టేల్‌కు సంబంధించిన యూనిట్‌కు ప్రభుత్వం రూ.లక్షా75 వే లు నిర్ణయించిందన్నారు. సబ్సిడీ పోను లబ్ధిదారు లు రూ.43,750 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూ ర్తి వివరాలకు మండల కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయంలో సంప్రదించాలన్నా రు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి రాచన్న, పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం రాత్రి వేళ బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా లేవని పేర్కొనడంతో డ్రైవర్ నిఖిల్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్ సీజ్ చేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ గిరి ఈ సందర్భంగా అన్నారు.

కబేళాకు తరలిస్తున్న గోవులకు విముక్తి

పహాడీషరీఫ్: కబేళాకు తరలిస్తున్న నాలుగు గోవులకు పహాడీషరీఫ్ పోలీసులు విముక్తి కల్పించారు. గురువారం ఉదయం తుక్కుగూడ నుంచి పహాడీషరీఫ్ వైపు ఓ ట్రక్కులో నాలుగు గోవులను కబేళాకు తరలిస్తుండగా గమనించి ఆపారు. బీబీ నగర్ నుంచి నగరంలోని కబేళాకు తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్ మహ్మద్ ఇంతియాజ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం జీవాలను గోశాలకు తరలించారు.

డబుల్ కల నెరవేరేనా?

డబుల్ బెడ్రూమ్ అర్హుల గుర్తింపులో అధికారులు

- జోరుగా సాగుతున్న ఇంటింటి సర్వే
- మున్సిపల్ పరిధిలోని వారికే అవకాశం
- వచ్చిన దరఖాస్తులు: 1, 246
- నిర్మాణంలో ఉన్నవి: 168



పట్టణంలో సర్వే చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

కొడంగల్ : డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు మొదలైంది. అర్హులెవరో తేల్చేందుకు ఇంటింటి సర్వే జోరుగా సాగుతోంది. మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్ సమీపంలో జీ ప్లస్ 2 పద్ధతిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మిస్తున్నారు. మొత్తం 1,246 మంది దరఖాస్తు చేసుకున్నారు. గాంధీనగర్ సమీపంలో నిర్మిస్తున్న ఇళ్లు 168 మాత్రమే. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఇంటింటి సర్వే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధల ప్రకారం అవసరమైన ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు తీసుకుంటున్నారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని కొడంగల్, పాత కొడంగల్, పాత కొడంగల్ తండా, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి, బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాల ప్రజలు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారం రోజుల నుంచి రెవెన్యూ సిబ్బంది సర్వే చేస్తున్నారు. చివరకు ఎవరు అర్హులో ఎవరు కాదో త్వరలో తేలిపోతుంది.

నిర్మాణంలో జాప్యం..

ఇళ్ల నిర్మాణాలు ఇప్పట్లో పూర్తి అయ్యే అవకాశం కనిపించడం లేదు. నిర్మాణాలకు టెండర్లు దక్కించుకున్న వ్యక్తి జాప్యం చేస్తున్నారు. పనులు ముందుకు సాగడంలేదు. నిర్మాణ కంపెనీ టెండర్లు దక్కించుకున్న సమయానికి ప్రస్తుత సమయానికి ఖర్చులు పెరిగి పోయాయి. వ్యయంలో పొంతన లేకుండా పోయింది. సిమెంట్, ఇసుక, ఇటుక, స్టీల్, కంకర తదితర వస్తువుల ధరలు పెరిగాయి. దీంతో కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యంగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిధులు ఎక్కువగా మంజూరు అయితేనే పనులు చేయాలనే ధోరణిలో గుత్తేదారు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణం మరింత జాప్యం అయ్యే అవకాశం ఉంది.

మొదటి దశలో 300 ఇళ్లు..

కొడంగల్‌కు మొదటి దశలో 300 ఇళ్లు మంజూరయ్యాయి. పట్టణంలోని గాంధీనగర్ సమీపంలో 168 ఇళ్లను నిర్మిస్తున్నారు. పట్టణ శివారులోని మిషన్ భగీరథ ప్లాంట్ దగ్గర 132 ఇళ్లను నిర్మించే అవకాశం ఉంది. 300 ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసింది. గాంధీనగర్ సమీపంలో నిర్మిస్తున్న 168 ఇళ్లకు రూ.9 కోట్లు, మిషన్ భగీరథ దగ్గర నిర్మించే ఇళ్లకు రూ.7 కోట్లు కేటాయించారు.

అధికారులు పరిశీలిస్తున్న పత్రాలు

- కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డులు
- కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు..
- బ్యాంకు పాస్ బుక్
- పొలం ఉంటే పాస్ బుక్
- వాహనాలు ఉంటే వాటికి చెందిన ఆర్‌సీ పత్రాలు

అర్హులకు మాత్రమే ఇళ్లు



కొడంగల్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులకు మాత్రమే కేటాయిస్తాం. పట్టణంలోని బాలాజీనగర్‌లో గత వర్షాకాలంలో వరదలు వచ్చి నష్టపోయిన వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తాం. మిగిలిన ఇళ్లకు అర్హులను గుర్తించి కల్పిస్తాం.

– బుచ్చయ్య, తహసీల్దార్

త్వరలో పూర్తి చేయిస్తా



డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేయిస్తా. రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం. ఖాళీ స్థలం ఉంటే ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

– నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కొడంగల్

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

- ఒకరి మృతి



మృతుని కుటుంబీకులకు ఆర్థిక సాయం అందిస్తున్న వడ్ల నందు

అనంతగిరి: ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం వికారాబాద్ పట్టణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ శీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూరు మండలం ఎబ్బనూర్ గ్రామానికి చెందిన బి.శ్రీనివాస్(37) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా ఉదయం ఆటోలో వికారాబాద్‌కు వచ్చాడు. మధ్యాహ్నం వేళ వికారాబాద్ నుంచి అనంతగిరిగుట్ట వైపు ఆటోలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో తాండూర్ వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

వడ్లనందు ఆర్థిక సాయం

ఎబ్బనూర్ గ్రామస్తుడు శ్రీనివాస్ మృతిచెందారనే విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు వడ్ల నందు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి కుటుంబీకులను ఓదార్చాడు. ఈ సందర్భంగా తనవంతు సహాయంగా వడ్లనందు ఫౌండేషన్ తరపున మృతుని తండ్రికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు.

అంతారంలో అగ్ని ప్రమాదం

సిలిండర్ పేలి హోటల్ దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తాండూరు రూరల్: గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన మండల పరిధిలోని అంతారంలో గురువారం చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంతారం గ్రామానికి చెందిన మడుగుల పెంటప్ప, పూలమ్మ దంపతులు తమ నివాసంలోనే చిన్నపాటి హోటల్ నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే ఉదయం సిలిండర్ ఆన్ చేసేక్రమంలో ఒక్కసారిగా పేలి మంటలు అంతా వ్యాపించాయి. తాండూరులోని అగ్నిమాపక సిబ్బంది ట్యాంకర్‌తో మంటలు ఆర్పేశారు. ఈ ఘటనలో కొంత నగదు కాలి బుడిద అయ్యిందని బాధితులు తెలిపారు. సర్పంచ్ రాములు, ఎంపీటీసీ శాంతులు బాధితుడి కుటుంబాన్ని పరామర్శించి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్యాస్ సిలిండర్ లీకేజీ అయితే మంటలను ఎలా ఆర్పి వేయాలో అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు.

సీసీఐ ఎదుట కార్మికుల ఆందోళన



సీసీఐ ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

తాండూరు రూరల్: సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఫ్యాక్టరీ ఎదుట కాంట్రాక్టు కార్మికులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి శరణప్ప మాట్లాడుతూ.. కంపెనీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గత నెల వేతనాలు ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. ఈ నెల 20వ తేదీకి కూడా జీతాలు రాకపోతే కార్మికులు ఎలా బతకాలి అని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో యాజమాన్యం స్పందించి కార్మికుల ఖాతాలో వేతనాలు జమ చేసింది.

శాంతిభద్రతల పరిరక్షణ అందరి బాధ్యత



లక్ష్మీనగర్ తండాలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

అనంతగిరి: శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత అని వికారాబాద్ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. గురువారం రాత్రి వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని లక్ష్మీనగర్ తండాలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఇళ్లకు వెళ్లి వారి వివరాలు అడగడంతో పాటు వాహనాలు ఉంటే వాటి ధ్రువపత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 15 బైకులను సీజ్ చేశారు. అనంతరం వారితో డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగానే కార్డన్‌సెర్చ్ చేపట్టామన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి వాడలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ శీను, పలువురు ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించడంతో..

యువకుడి అదృశ్యం



రాంచంద్రయ్య (ఫైల్)

దోమ:తల్లి మందలించడంతో కుమారు డు అదృశ్యమైన ఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలోని గురువారం చోటుచేసుకుంది.ఎస్‌ఐ విశ్వజన్ తెలిపిన వివరాలి లా ఉన్నాయి. మండల పరిధిలోని దిర్సంపల్లికి చెందిన మంగళి రాంచంద్రయ్య(32) అనే వ్యక్తిని కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అంతటావెతికినా ఆచూకి లభించకపోవడంతో భార్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యవసాయ అధికారి మిస్సింగ్



గంగాధర్ (ఫైల్)

పరిగి : వ్యవసాయ అధికారి అదృశ్యమైన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరిగి పట్టణంలోని భూసార పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న గంగాధర్ ఈ నెల 18న అదృశ్యమయ్యారు. ఎప్పటిలాగే విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఆయన ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అంతటా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని కుమారుడు రిషికేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

యథేచ్ఛగా తరలుతున్న కలప

- నామ్‌కేవాస్తేగా జరిమానాలు
- మామూళ్ల మత్తులో ఫారెస్ట్ శాఖ



ధారూరు పీఎస్‌లో కలప లారీ

ధారూరు: అడవులు గొడ్డలివేటుకు గురవుతూనే ఉన్నాయి. యథేచ్ఛగా కలప తరలుతూనే ఉంది. అధికారులు నామమాత్రంగా జరిమానాలు వేసి వదిలేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా గురువారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌కు అక్రమంగా కలపను తరలిస్తున్న లారీని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఫారెస్టు రేంజ్ అధికారికి అప్పగించారు. సదరు అధికారి నామమాత్రపు జరిమానా విధించి వదిలిపెట్టారు. ఇలా జరిమానా వేసి వదిలేయడం లాంటి ఘటనలు షరా మామూలుగా మారాయి. ఫారెస్టు రేంజ్ పరిధిలో తరుచూ జరుగుతున్న తంతు ఇది. అడవులను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుంటే.. అధికారులేమో జరిమానాలు విధించి వదిలేస్తున్నారు. రోజూ లారీల కొద్దీ కలప తరలుతుంటే ప్రకృతి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని ప్రజా ప్రతినిధులు, ప్రజలు వాపోతున్నారు. అక్రమ కలప తరలింపుపై ఉక్కుపాదం మోపాల్సిన అటవీశాఖ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని ప్రజాప్రతినిధులే ఆరోపిస్తుండటం గమనార్హం. వికారాబాద్ రేంజ్ అధికారి ఒకరు కలప లారీకి రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేసి వదిలిపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫారెస్టు అధికారుల కనుసన్నల్లోనే కలప అక్రమ రవాణా జరుగుతోందని చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో అడవులు పూర్తిగా కనుమరుగు కావడం ఖాయమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఫారెస్టు అధికారులు అక్రమంగా కలపను తరలిస్తున్న వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సరిపడా సిబ్బంది లేరు

ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలో 20 మంది బీట్ ఆఫీసర్లు ఉండాలి. కానీ ఒక్కరే ఉన్నారు. కలపను మహబూబ్‌నగర్, కొడంగల్ ప్రాంతాల నుంచి తరలిస్తున్నారు. పట్టుబడితే జరిమానా విధిస్తున్నాం. పొలం గట్లపై ఉన్న చెట్లను రైతులు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వీటిని అడ్డుకుంటే కోతుల బెడద చెప్పి తప్పించుకుంటున్నారు. అక్రమంగా కలప తరలిస్తుంటే సమాచారం ఇవ్వాలని కోరారు.

– కృష్ణ, ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న నేతలు

దోమ: కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బాస్‌పల్లిలో గ్రామానికి చెందిన పద్మారం రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ క్రమంలో రామ్మోహన్ రెడ్డి గ్రామ మాజీ సర్పంచ్ అనంతయ్యతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఎలాంటి కష్టాలు వచ్చినా తనను సంప్రదిస్తే ఆదుకునేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటయ్య, పులి శ్రీను, రాజు, ఆంజనేయులు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ: ముగ్గురికి గాయాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం కొత్తగడి సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మర్పల్లి మండలం బూచన్‌పల్లికి చెందిన తిరుపతిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి బైక్‌పై వికారాబాద్ వస్తుండగా, వికారాబాద్ నుంచి బైక్‌పై కావాలి బాలరాజ్ నారాయణపూర్‌కు వెళ్తుండగా కొత్తగడి సమీపంలో ఢీకొన్నాయి. ఈఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమయానికి అంబులెన్స్ రాకపోవడంతో ప్రైవేటు వాహనంలో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషమంగా ఉండటంతో నగరానికి రెఫర్ చేశారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి



దోమలో రంజాన్ కానుకలను అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ : మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు దిర్సంపల్లి గ్రామంలో పేద ముస్లింలకు రంజాన్ కానుకలను జెడ్పీటీసీ నాగిరెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని అన్నా రు. పేదలను ఆదుకోవడంలో దేశంలోనే సీఎం కేసీఆర్ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లింలకు ఫలహారాలను తినిపించారు. కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఖాజా పాష, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్‌ఐలు, బీఆర్‌ఎస్ నేతలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మండల కేంద్రానికి చెందిన వార్డు సభ్యుడు లక్ష్మణ్ అనారోగ్యంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి నగరానికి వెళ్లి లక్ష్మణ్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు.

వీఓఏల వినతి

తమ సమస్యలను పరిష్కరించాలని మండల వీఓఏలు ఎమ్మెల్యే మహేశ్ రెడ్డికి గురువారం పరిగి పట్టణంలోని ఆయన నివాసంలో వినతి పత్రం అందజేశారు. కొన్నేళ్లుగా చాలి చాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని వీఓఏలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మండల పరిధిలోని బాస్‌పల్లిలో రాములమ్మ అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ మేరకు ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, జెడ్పీటీసీ నాగిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.

రైతులు న్యాయ సలహాలు పొందండి

- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ సుదర్శన్



మాట్లాడుతున్న సుదర్శన్

కొడంగల్ రూరల్: రైతులు వ్యవసాయ న్యాయ సలహాలు తీసుకుంటూ లబ్ధిపొందేందుకు కృషిచేయాలని జిల్లా న్యాయమూర్తి, లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ కె.సుదర్శన్ సూచించారు. గురువారం రాత్రి మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో వ్యవసాయ న్యాయ సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో రైతులకు సూచనలు చేశారు. వ్యవసాయ సంబంధ సమస్యలను న్యాయ సహాయ కేంద్రంలో తెలియజేయాలన్నారు. తమ సమస్యలను వినతిపత్రాల ద్వారా వివరించడంతో జిల్లా న్యాయస్థానం దృష్టికి తీసుకొస్తారని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తదితర వాటి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత రైతులు ఇబ్బందులు తొలగించేందుకు వ్యవసాయ న్యాయ సహాయ కేంద్ర ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి డి.బి.సీతల్, వ్యవసాయాధికారి గోపాల్, కొడంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య, ఏడీ శంకర్ రాథోడ్, ఏఓ బాలాజీప్రసాద్, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

యాలాల: గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) నాయకులు నర్సింహులు, డప్పు మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ గోవిందమ్మకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉండదన్నారు. గిట్టుబాటు ధరతో కేంద్రాలను ఏర్పాటు చేయడంతో రైతులకు మేలు కలుగుతుందన్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.